# ఇంద్రధనుస్సు

సాయంకాలం నీరెండలో దేవాలయ శిఖరం తళతళలాడుతోంది. గుళ్లో జంగం నాగలింగం శంఖం ఊదుతున్నాడు. రోజల్లా తిరిగి తిరిగి పావురాళ్ళు గాలిగోపరం గూళ్ళలోకి చేరుకుంటున్నాయి. దేవ దర్శనం కోసం జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఆ గుంపులో రవి కూడా ఒకడు. రవి ఒక్కోసారి మందంగా, మరొకసారి ఆత్రంగా అందుకో బోతున్నవాడిలా గబగబా అడుగు లేస్తున్నాడు. జనమంతా కింది ప్రాకారంలోని జమ్మిచెట్టుకి ప్రదక్షిణాలు చేస్తున్నారు. రవి కూడా ప్రదక్షిణం చేస్తున్నాడు. జమ్మిచెట్టు చుట్టూ కాదు. ఆ ఆకుపచ్చ పరికిణీ వెనకాలే, ఆ ఊదారంగు జరీ పోగుల వోణీ నీడల్లో, సీత వేసిన అడుగుల్లోనే తనూ అడుగు లేస్తాడు. ఆమె తాకి కళ్ళ కద్దుకున్న చోటే తనూ జమ్మిచెట్టుని తాకుతాడు.

ప్రదక్షిణాలు పూర్తయ్యాక జమ్మి ఆకు రెమ్మలు రెండు కోసికొని తల్లో పెట్టుకుంటుంది సీత. వోణీ నడుం చుట్టూ బిగించి ఒక్క ఎగురు ఎగిరింది. కాని కొమ్మ అందలేదు. ఇంకా ఎత్తుగా ఎగరటానికి ఎదురుగా రవి నుంచుని చూస్తున్నాడు. రవి ఒక్క ఎగురులో కొమ్మ అందుకొని ముందుకు వంచాడు. సీత చటుక్కున నాలుగు రెమ్మలు తుంచుకుని తల్లో తురుముకుని గబగబా కాలభైరవుడి గుడివైపు నడిచి పోయింది. 'కొమ్మ ఎలా వంగిందో ఎవరు వంచారో' అని

తనవైపు ఒక్కసారి చూడవచ్చుగా! ఆ కాటుక కళ్ళ కొసల నైనా తన రూపం ప్రతిఫలించ వచ్చుగా! ఉహూఁ...' అనుకున్నాడు రవి.

క్రింది ప్రాకారంలోంచి గుళ్ళోకి వెళ్ళడానికి మెట్లెక్కుతున్నా రందరు. పై మెట్టుమీద సీత, సీత చెయ్యి పట్టుకుని ఎక్కుతున్న సీత చెల్లెలు, వెనక తను—అలా ముందు సీత నడుస్తుంటే ఆమె వెనకాలే కళ్ళుమూసుకుని ఎన్ని మెట్లైనా ఎక్క వచ్చు. ఈ మెట్లు అనంతంగా ఉంటే ఎంత బావుణ్ణు — అనుకున్నాడు రవి.

గుడినిండా సందులేకుండా వందలాది కార్తీక దీపాలు పెట్టారు. మినుకుమినుకు మనే ఆ దివ్వెల బారుల మధ్యగా సీత పట్టపు రాణిలా నడిచి వెళ్ళింది. గుళ్ళో ఆగకుండా గంటల మోతలు, కొబ్బరికాయలు పగలగొట్టిన చప్పుళ్ళు, అమ్మవారి మీద పాటలు, దేవుణ్ని పేరుపెట్టి పిలవటాలు. రవి ఎవర్ని పిలుస్తాడు? అతని కేక వినిపిస్తుందా? తనూ గంటకొట్టాడు. 'సీతా' అని మోగి అటూ ఇటూ వూగింది.

అర్చకుడిచ్చిన మారేడుదళం నందీశ్వరుడిమీదఉంచాలి. సీత చెల్లెలికి ఎత్తుగావున్న నందిమూపు అందదు కాబట్టి చెల్లెల్ని ఎత్తుకుని పత్రి నందిమీద వేయించింది. అంతలో తను అక్కడికి వచ్చేశాడు. తన్ను చూసిన సీత తొట్రుపాటుపడింది. తన చేతిలోని మారేడుదళాన్ని నందిమీద విసరి చకచకా ముందుకు సాగింది. ఆ విసరిన మారేడుదళం నంది మూపునుంచి జారిపోతూంటే తను పట్టుకుని తన చేతిలోని దళంతో కలిపి నందిమీద ఉంచాడు. నంది శృంగాల మధ్యనుంచి ఈశ్వరుణ్ణి చూసి వందనం చేశాడు.

సీత దేవాలయం మెట్లు దిగి కిందికి వెళ్ళిపోతోంది. దూరంగా గుళ్ళో గంటలమోతలు, వేదమంత్రాలు వినిపిస్తున్నాయి. చీకటి చిక్కగా మూసికొంది. రవి పదడుగుల దూరంలో ప్రహారీగోడ ప్రక్కగా నడుస్తున్నాడు. సీత వున్నట్టుండి వెనక్కు తిరిగింది. చీకట్లో అనుసరించి వస్తున్న రవి రూపం లీలగా కన్పించేసరికి కంగారుపడింది. చెంగున దూకి ప్రహారీమలుపు తిరిగింది. జడలోని మల్లెచెండు ఎగిరి కింద పడింది. సీత గమనించలేదు. నాలుగడుగులు వేసిన సీత జడ తేలిగ్గావుంటే తడిమి చూసికొంది. చెండు కన్పించలేదు. వెనక్కు తిరిగి చూస్తే ధ్వజస్థంభానికి కట్టిన ఆకాశదీపం వెల్తురులో రవిచేతిలోని మల్లెచెండు కనిపించింది. సీత ముందుకు వచ్చి చేయిచాచింది. 'నా చెండు నాకిచ్చేయి!' అన్నట్టుగా. రవి గుప్పిట ముడిచి చెయ్యి వెనక్కు లాగుకొన్నాడు. సీత ఓరమోము చేసింది. కళ్ళు కోపంచేసి పెద్దవయినాయి. తనకు భయంవేసింది. తనేదో చెప్పబోయాడు. సీత చటుక్కున తన చేతిలోని మల్లెచెండుని లాగేసుకొని నవ్వుతూ పరుగెత్తింది. కొంతదూరం పోయాక వెనక్కు తిరిగి మల్లెచెండుని ఎగరేసి చూపించి, వెక్కిరించి, మళ్ళీ నవ్వుతూ పరుగెత్తింది. తను అలాగే నిల్చుండిపోయాడు. ఇదంతా చూస్తున్న ధ్వజస్తంభం గంటలు గణగణమోగాయి. ఆకాశ దీపం కిలకిల నవ్వింది.

పెళ్ళి పందిరినిండా జనం కిక్కిరిసి కూర్చున్నారు. పందిరి చివర సన్నాయి మేళం, డోలు, బాకాలు మోగుతున్నాయి. అగ్నిహోత్రం ముందు పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. పందిట్లో 'అవి కావాలి — ఇవి కావాలి'

అని అరుస్తూ తిరిగే పెళ్ళి పెద్దలు, అందులో పిల్లల ఏడుపులూ ఒక మూల రాజకీయాలు, ఇంకో మూల పేకాట, కొత్త సంబంధాలు, పాత ప్రణయాలు, ఈ కాలం వారి పోకిళ్ళు, దొర్లి పోతున్నాయి. పెళ్ళి పీటలమీద రవికి సీతకి మధ్యగా తెరసెల్లా పట్టారు. రవికి పల్చటి ఉత్తరీయంలోంచి సీత పెళ్ళి కూతురై కన్పించింది. 'ఎంత సేపు, ఈ తెరసెల్లా తీసెయ్య కూడదూ' అనిపించింది. సుముహూర్తంలో బాజా భజంత్రీల మ్రోత హోరెత్తగా రవికి సీతకి మధ్య తెర తొలగిపోయింది. రవి పక్కవాటుగా సీతను చూశాడు. సీత ముఖంమీద కళ్యాణ తిలకం తళుక్కున మెరిసింది. బుగ్గమీద చుక్క వెక్కిరించింది. మధుపర్కం కట్టిన సీత చెంప మోకాలికి చేర్చి సిగ్గుతో ముకుళించుకుపోయి నేల చూపులు చూస్తోంది. రవి సీతా ఇద్దరూ లేచి నుంచున్నారు. సీతని రవి వేలు పట్టుకో మన్నాడు పురోహితుడు. రవి చేయందించాడు. సీత సుతారంగా వేలందుకుంది. ఆ స్పర్శకి రవిలోకి కొత్త జీవం పోసి నట్లైంది. ఇద్దరూ అగ్ని చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. తనకి తోడుగా సీత ఉంటే భూప్రదక్షిణమైనా చేస్తాను — అనుకున్నాడు రవి.

రవి సాంసారిక జీవితం భావగీతంలా హాయిగా ఉంది. రవి కేమేం కావాలో రవికంటే సీతకే ఎక్కువ తెలుసు. అప్పటిదాకా కొడిగట్టి మందంగా వెలుగుతున్న దీపం కొడి దులిపితే వెలుగులు చిమ్మి నట్లైంది. రవి జీవితంలో సీత సాంగత్యం, సన్నజాజీ పందిరి, చుక్కల ఆకాశమే కాకుండా బయట ప్రపంచం చాలా ఉంది. ఆ ప్రపంచంలో తన జీవిక సాగడానికి వలసిన సామగ్రి కూర్చుకోవటం, అందులో

ఎత్తులూ, పల్లాలూ, పడటం లేవటం, నిరాశ మొదలైనవన్నీ తటస్థపడుతూనే ఉన్నాయి. ఇంటికి రావడంతోనే సీత పలకరిస్తుంది. ఆ పలకరింపులో చిరునవ్వుంటుంది. అందులో ధైర్యం పొంగుతుంది. తనలోకి కొత్త రక్తం ప్రవహించినట్లుంటుంది. ఎంత భారమైనా ఇంతలో తొలగిపోవటం సీత సాహచర్యంవల్ల రవికి సాధ్యమైంది. ఒక్కమాటలో రవికి జీవితంలో ధైర్యంగా నిబ్బరంగా అడుగులు వేయటం సీత నేర్పింది. రవికి సీత మనస్సు తరిచి చూడాలనికోరిక. కాని ఎలా సాధ్యం! సముద్రాన్ని తరిచి చూడటంలాంటిది అది. భూదేవిలాంటి సీతలో తనకవగతమైంది చాలా కొద్ది.

సరిగ్గా రెండు సంవత్సరాల తర్వాత రవి జీవనలత కొత్త పూవు పూసింది. పురిటింట్లోకి రవి పరుగెత్తుకొచ్చాడు. బాలెంతరాలైన సీత పచ్చిపసుపు కొమ్ములా ఉంది. గర్వంగా ఆమె కళ్ళు మిలమిలలాడాయి. తృప్తిగా వడిలోని బాబుని చూసుకొంది. రవిని చూసింది. బాబు కళ్ళు తెరిచీ తెరవడంతోటే తల్లిని హత్తుకుంటున్నాడు. బాబుకి సంవత్సరంనిండింది. పిలిస్తేచాలు పాలు పొంగినట్లు నవ్వుతున్నాడు. రవి రమ్మని చేతులూపితే తనూ రమ్మని చేతులూపుతాడు. రవి చప్పట్లు చరిస్తే తనూ మోతరాని చప్పట్లు చరుస్తాడు. కొడతానని వేలుతో బెదిరించబోతే తనూ బెదరించబోతాడు. కోపంగా బిక్కమొహంపెట్టి చూస్తే, బిక్కమొహంపెట్టి తల్లి ఒళ్లో తల దాచుకుంటాడు. తిరిగి పావుగంటదాకా పలకడు-నవ్వడు.

'వేలెడు లేడు. ఇప్పట్నించే వీడికెందుకో ఇంత పంతం' అంటాడు రవి.

'అది పంతంకాదు, పట్టుదల. మంచి దేగా!' అంటుంది సీత.

'ఇప్పట్నించే నేర్పు మొండితనం' కసురుకుంటాడు రవి.

సీత వానకురిసినట్లు నవ్వి 'మీ పోలికే వస్తుందిలెండి' అంటుంది.

రవి సీతనుచూసి నవ్వకుండా ఉండలేకపోతాడు.

'నీ పోలికలొస్తే అందంకాని, నా పోలిక లెందుకూ?' అన్నాడు రవి.

'ఎందుకూ ఏమిటి! చూడండి. ఆ ముక్కూ, ఆ పెదవులూ, ఆ దొంగచూపులూ—అన్నీ మీ పోలికలే' అంది సీత.

'మిగతా పోలికలన్నీ నావేనేమోకాని, ఆ చూపులు మాత్రం నీవే' అన్నాడు రవి.

'నావేం దొంగచూపులు కావు' — పెదిమ కొరుకుతూ అంది సీత.

'కాకేం! అటుచూడు. నా చేతిలోంచి మల్లెచెండు లాగేసికొన్న నాటి చూపులు' అన్నాడు రవి.

'ఏమీకావు. పెళ్ళిలో నీళ్ళ బిందెలో ఉంగరాలు వెతుకుతూ నా చేయి గిచ్చి చూసిన చూపులు, పట్టి దొంగ చూపులు' అంది సీత.

అంతలో బాబు నాయనమ్మ లోపలికొచ్చి 'అదేమిటే దొంగచూపు లంటున్నారు — మా బాబువి దొర చూపు లయితే, ముత్యాల చూపులు కదమ్మా' అంది.

'కావు మరీ. నా పోలికేనాయెను' అన్నాడు రవి.

'ఆ! పాపం మీ పోలిక కాదన్నారుగా ... అవి నా పోలికే' అంది సీత.

అంతలో బాబు తాతగారు లోపలికొచ్చి 'మీ ఇద్దరివి కాదర్రా. ఆ చూపులు వాళ్ళ నాయనమ్మ పోలిక' అన్నాడు.

'సరిసరి? చూపు లెవరివైతే నేం కాని తాతగారి మాటలు మాత్రం నేర్చుకోకు నాయనా—అయినా చూశారా! వాడు ఓ పక్క కళ్ళు మూసుకు నిద్రపోతుంటే, వాడి చూపులు పోలికలు లెక్క కడుతున్నాం మనం' అంది బాబు నాయనమ్మ.

* * *

ఆనాటి సాయంత్రాన కృష్ణానది మెలికలు తిరుగుతూ గల గల ప్రవహిస్తోంది. గుట్టలు దూకుతూ రాళ్ళమధ్య నుంచి దోవ చేసుకుంటూ పరుగెత్తి పోతోంది. బాబు ఐదేళ్ళ వాడైయినాడు. రవి సీత బండరాళ్ళమీద కూర్చుని పరుగెత్తే కృష్ణమ్మని చూస్తున్నారు. బాబు ఒడ్డునే అల తీసికొచ్చిన నీళ్ళతో ఆడుకుంటున్నాడు.

బాబు ఉన్నట్టుండి 'అదేమిటి నాన్నా ఆ రంగులు' అన్నాడు ఆకాశం వైపు చూపిస్తూ.

ఆకాశంలో ఇంద్రధనుస్సు విరిసింది.

'ఆకాశంలోనా...మీ అమ్మ' అన్నాడు రవి.

బాబు పక్కున నవ్వాడు. అర్థంకాక వాళ్ళమ్మ వైపు చూశాడు, అనుమానంగా.

సీత పెదిమలకు కొంగు అడ్డంపెట్టుకుని అటువైపు తిరిగి చూస్తోంది. సీత వినలేదు — వింది. నవ్వింది — నవ్వలేదు. ఇంద్రధనుస్సులో ఈ కన్పించే రంగుల వెనకాల ఎన్నిరంగులు!

ఎన్నెన్ని రంగులు!

తనకు అవన్నీ ఎప్పుడు కన్పిస్తాయి —

తనూ ఆ ఎత్తులు ఎప్పుడు అందుకుంటాడు? అనుకున్నాడు రవి.